# "దీని బతుకింతే"

—ప్రతాప రవిశంకర్, మద్దాళి ప్రదీప్ కుమార్

"నాస్టు బసెల్లి పోనాదా' బీడీ దమ్ము గట్టిగా లాగి పొగను రింగులుగా వదులుతూ అడిగాడు సారా గంగులు

'ఇంకా ఎల్లిపోనేదు". "ఎటికి". "టవున్నుంచి టూబులేసుకు రావాలా?" సత్తుగ్లాసులో పంచదార వేస్తూ అడిగింది అలివేలు

"ఈ రేత్తిరికెల్లి రేపు కోడి కూసేతలికి యీడుండాలి పట్టు బస్సులో వచ్చేత్తాలే"

"టీ తాగుతావా" టీని తిరగబోస్తూ అడిగింది

"నీ సేతిమీదగా యిత్తే తాగ నంటానా" వెకిలిగా నవ్వాడు గంగులు.

టీ గ్లాసును అందుకుంటూ అలివేలు చేతి వేళ్ళను గట్టిగా నొక్కాడు

"మోటు సచ్చినోడు" మనసులో అనుకుంది అలివేలు

"నాయాల్డి .. బెంబాండంగా వుండేటీ . నీ మొగుడికన్నా నువ్విత్తేనే బాగుండుద్ది టీ"

"సాల్లే .. నోరు మూసుకొని గమ్మున తాగెయ్ మల్లీ ఆ సచ్చినోడు వత్తే యీ లుండదు" తొందర చేసింది అలివేలు.

టీ తాగి మళ్ళీ బీడీ వెలిగించాడు గంగులు. టీ కొట్టు ముందరున్న చెక్కమీద గొంతు కూర్చున్నాడు

"మాలచ్చి మునుసుబు సోటుకొని మేడ కటిచ్చిదంటగా" పొయ్యిలో కట్టెలను లోపలకు నెడుతూ అన్నది అలివేలు

"ఓ రన్నారు నీతో"

"వూల్లో వాల్లందరూ అనుకొంటున్నారు. సొమ్ముబాగా కూడ బెట్టిం దంటగా"

"అదంతా దాని గొప్పతనవా? ఏందీ? నాను పోలీసోల్ల కంట పడకుండా టూబు వేసుకు నాకపోతే యిది ముసుగేసు కునేదే. మల్లీ వోటకి అసమోకే అలివేలూ .. మునసబు దానికిసోటమ్మనేదు కరీదు కట్టకుండానే యిచ్చేసినాడు" రహస్యంగా చెప్పాడు గంగులు

"అదేందీ' ఆశ్చర్యంగా అడిగింది అలివేలు

"ఆదేవుంది కిరుకిరు"

"కిరు కిరంటే"

"నీకు యే యిసయం అరదంగాదే , మాలచ్చి మునుసుబును వుంచుకొంది ఆడు దానికి రంకు మొగుడు "

"నిజంగానా ?" నమ్మలేనట్టుగా అడిగింది అలివేలు

నిజంగానా యేంది నీతోడు మాలచ్చి యిప్పుడు మునుసుబు గాడింటోనే వుంది. రేత్తిరికి ఆడితో కులికి తెల్లారకముందే ఓరూ సూడకుండా యింటికొచ్చిద్ది ఆడు దానికి బాడవ సేను ఎకరన్నర కూడా రాత్రాదన్నా

డంట దర్యాప్తుచేసి హెడ్‌కానిస్టేబుల్ లాగా చెప్పాడు గంగులు

"నీ జిమ్మడ నీకీ యిసయాలు ఎట్టాగు తెల్సినాయి" నోరు తెరిచి అడిగింది ఆశ్చర్యంగా అలివేలు

"మరి సారా గంగులు గాడంటే ఏటను కొంటున్నావ్; నాను డిటెక్టివును యేందను కుండావో" ఒక మాదిరిగా పెరిగిన మీసాలను మెలివేశాడు గంగులు

ఇంతలో బస్సు వస్తున్న మోత వినిపించింది. రోడ్డుమీదికి వెళ్ళి చూశాడు గంగులు. చెరువుకట్టమీదుగా వస్తోంది నీలంరంగు బస్సు

అలివేలా బస్సొత్తుంది. మళ్లీ రేపు తెల్లారగట్ట వత్తానులే" చెప్పి రోడ్డుమీదకు వచ్చి మర్రిచెట్టు నీడన నిల్చున్నాడు

బస్సు టీకొట్టుముందాగింది లాస్టు బస్సు కావటంచేత నలుగురైదుగురి కంటె ఎక్కువమంది ప్రయాణీకులులేరు బస్సులో నించి ఇద్దరు క్రిందికిదిగారు గంగులు బీడి కింద పారేసి బస్సులో ఎక్కికూర్చుని అలివేలు వైపు చూసి ముసిముసిగా నవ్వాడు

అలివేలుకూడా సన్నగా నవ్వింది.

బస్సులోనించి దిగిన ఇద్దరు ప్రయాణీకులూ రెండు టీ కలపమన్నారు. టీ తాగి ఇద్దరు వెళ్ళిపోయారు

బస్సు పెద్ద చప్పుడు చేసుకుంటూ వెళ్ళిపోయింది

ఇంకా టీ కోసం ఎవ్వరూ రారని అలివేలుకు తెల్సు. లాస్టు బస్సు వెళ్ళాక కొట్టు మూసేస్తుంది. రోజూ.

కొట్టుమూసేసి చిల్లర డబ్బులు లెక్కబెట్టి డబ్బాలోపడేసి గుడిశెలో పెట్టివచ్చింది రోడ్డు మీదకు వచ్చి పది నిముషాలసేపు చూసింది మొగుడు సీతారాములు వస్తాడేమోనని, వస్తున్న జాడ కనిపించలేదు.

డిసెంబరు నెల చివరిరోజులు చలిచలిగా వుంది పమిటకొంగును తల మీదుగా కప్పుకొని గుడిశెలోకి వెళ్ళి తలుపేసుకుని పడుకుంది వెన్నులోంచి చలిపుట్టుకొచ్చింది. దుప్పటితీసి కప్పుకుంది.

చలి ఆగలేదు.

దిండునుతీసి వాటేసుకుని పడుకుంది.

చలి ఆగలేదు.

"గంగుల్ని వుండమన్నా బాగుండేది".

అనుకుంది అలివేలు చలిబాధను భరించలేక, దుప్పటి కప్పుకుంటే ఆగే చలికాదు అది. దానికి మరో మనిషి తోడుకావాలి ఆ విషయం అలివేలుకు తెలుసు సీతారాములు వస్తాడేమో అనుకుని గంగుల్ని వుండమనలేదు.

తలుపుమీద ఎవరో గట్టిగా కొట్టారు.

విసుగ్గా లేచి తలుపు తీసింది,

ఎదురుగా –

సీతారాములు నించుని వున్నాడు అడ్డు తప్పుకుంది,

"కొట్టు మూసేసినావేం" లోపలకువస్తూ అడిగాడు సీతారాములు. మాట్లాడినప్పుడు సారావాసన గుప్పుమంది నోట్లోనించి.

"నాస్టుబస్సు ఎల్లిపోనాది" తలుపేస్తూ చెప్పింది అలివేలు

సీతారాములు తూలుతున్నాడు. వాడిని భుజాలు పట్టుకుని నడిపించుకుపోయి నుక్కిమంచంలో పడుకోబెట్టింది

పడుకున్న మరు నిమిషంలో నిద్రపట్టింది. సీతారాములుకు.

ఏడుపు వచ్చింది అలివేలుకు.

"ఇదేవరస పెతిరోజూ ... పక్కన పెళ్లాం వుందనే యిసుమంత కూడా తెలీదు ముదనష్టపోడికి .. ఇట్టాగైతే తను బతికినట్టే బేగి తనదారి తను సూసుకోవాలి."

ఒక నిశ్చయాని కొచ్చిన దానిలా ముసుగు తన్ని పడుకుని ఎప్పటికో నిద్రపోయింది

అలివేలు.

* * *

గంగులు మర్నాడు ఉదయం రాలేదు. లాస్టు బస్సుకి వచ్చాడు సీతారాములు ఇంట్లో లేడు

"ఇన్నాళ్ల నీతో వొక విషయం మాట్లాడలే అలివేలూ" అన్నాడు చెక్కమీద కూర్చుంటూ గంగులు

"ఏందది" కొశ్చిన్ మార్కు ముఖం పెట్టింది అలివేలు

"నాను టవునులో సారా కొట్టు పెట్టుకున్నాను నా పెళ్లాం నన్నొగ్గేసి దాని పుట్టింటికి ఎల్లిపోనాది. దానికీ, నాకు ఇక ఎటువంటి సంబంధం లేదు అది వొదిలేసే వుంచుకుందట ఆల్లూళ్లో. నా నొక్కన్నే బతకాల మువ్వా ఈ సీతారాములు గాడితో యేం సుకపడుతున్నావని ఆ నాయాలు నాగొచ్చి నిద్దరోపటమేగా నీ కోరికలేం తీరుతుంటాయని మువ్వా నాతో వచ్చేయి ఇద్దరం టవున్లో సుకంగా బతుకుదాం నిన్ను నా పెనంలా సూసుకుంటాను" మధ్యలో ఆగాడు గంగులు.

అలివేలు మాట్లాడ లేదు.

ఆలోచిస్తోంది గంగులన్న మాట నిజం తను సీతారాములుతో ఏం సుక పడుతుందని గంగులుతో లేచిపోవడమే నయం సుకంగా టవున్లో బతకొచ్చు

అంగీకార సూచకంగా అలివేలు పెదవులపై చిరు నవ్వు.

అర్థం చేసుకున్నాడు గంగులు.

* * *

టవునలో జీవితం అలివేలుకు బాగా నచ్చిపోయింది. బేరం బాగానే సాగుతోంది. గంగులు అలివేలును బాగానే చూసుకుంటున్నాడు, సుఖపెడుతున్నాడు. గంగులు లేనప్పుడు అదివేరే బేరం చూసుకుంటోంది నాలుగురోజులకో సినిమా చూస్తోంది తల నిండా మల్లెపూలు కనకాంబరాలు, గడ్డి చేమంతి పూలు పెట్టుకుని దుకాణం ముందు కూచుని రిక్షవాళ్ళని బాగా ఆకర్షిస్తోంది గంగులు అలివేలును ఎరగా పెట్టి బాగానే సంపాదించాడు

ఒకరోజు ఎవడో వస్తాదులాంటివాడు వచ్చి పీకలదాకా తాగి అలివేలు కొంగుపట్టుకుని లాగాడు అలివేలు వాడిని ఈడ్చి దవడమీద కొట్టింది బాగా రెచ్చిపోయి వాడు అలివేలును గట్టిగా వాటేసుకున్నాడు అప్పుడే సారా టూబు వెనుకొచ్చిన గంగులు ఈ దృశ్యం చూసి అందుబాటులోవున్న ఆయుధంతో వస్తాదు తల చిట్లగొట్టాడు హీరోలా.

అంతా సవ్యంగానే జరిగిపోయింది

గంగుల్ని ఎగ్రగోసి పోలీసులు అరెస్టు చేశారు "నువ్వు జైలు కెల్లొద్దు మావా" అని భోరున ఏడ్చింది అలివేలు

"పిచ్చి మొకమా ఏటికే ఏడత్తావు .. మల్లీ నాలుగైదు నెల్లో తిరిగి రాను అందాకా ఓపికపట్టు కొట్టును జాగరతగా సూసుకో" ధైర్యంచెప్పి మరీ జైలు కెళ్ళాడు గంగులు

గంగులు జైలు కెళ్ళిన నెలరోజులదాకా పవిత్రంగానే బతికింది అలివేలు ఆ తర్వాత గాగా ఎండిన బూరుగాయలా ఎగిరిపడుతున్న కోరికలను అణచుకోలేకపోయింది అందుకే రిక్షాతొక్కే వెంకటసామితో సంబంధం పెట్టుకుంది

తన కోర్కెలను తీర్చుకుని వాడి కోర్కెలను తీరుస్తుంది కల్పవృక్షంలా.

అలివేలు ఆ రాత్రి కలలోంచి లేచింది మరురోజు రాత్రికి జైలునుంచి పారిపోయి వచ్చాడు గంగులు మరొకడికి అమ్ముడపోయిన మన్నుపోతు తనదోటి నేలను చూడటానికి వచ్చినట్లు

కొట్టు మూసివుంది.

తడిక దగ్గర నిల్చున్నాడు గంగులు హింస యిన్ను ఎత్తుకు పోవటానికి వచ్చిన రూపాయి పావలా విలన్ లా.

గుడిశె లోపల్నించి గుసగుసలు వినిపించాయి హెచ్చు తగ్గుస్వరాల్లో కైవించిత్రాల్లో "రాజా పిలుపు నాదేనురా" అని పాట వచ్చినట్లు

"ఇంకో నెల్లో గంగులొస్తాడు మనం యిట్టా సుకపడటానికియిూ లేదు" అంటోంది. సంచివాడైనా, వాడే మన్మధుడనుకునే రాజుగారి పెళ్ళాంలాగా అలివేలు

"ఆడి మొకం ఆడొచ్చేదాకా మనం యిూడుంటామా యేంటీ? నువ్వు ఈ కొట్టమ్మేసి డబ్బు తీసుకురా ఇద్దరం ఎటైనా లేచిపోదాం. సుకంగా గువ్వల్లాగ బతకొచ్చు" అంటున్నాడు ఎంకటసామి తెలుగు సినిమా హీరో డైలాగులు బట్టీపడుతున్నట్లు

"పోల్లే. యింక నువ్వింటికెల్లు.. నేకపోతే... నీ పెల్లాం యాడకొచ్చిద్ది" రోమియోను వదలలేని జూలియట్ లా పోజు పెట్టింది అలివేలు

ఎంకటసామి తడిక తెరుచుకుని బయటకు వచ్చాడు

"అంతే వాడి తల వెయ్యి ముక్కలయింది. పొలికేక పెట్టాడు ఎంకటసామి.

కిందపడ్డ వాడిని కసితీరా చితకతన్నాడు గంగులు. ఎంకటసామి ప్రాణం పూర్తిగా అరమైలు దూరం వెళ్ళిందని తెలుసుకుని తడికినెట్టుకుని లోపలకు వెళ్ళాడు

లోపల చీకటిగావుంది జేబులోంచి అగ్గిపెట్టె తీసివెలిగించాడు

చీకట్లో వెలుగు

అలివేలు ఎక్కడా కనిపించలేదు. విసుగ్గా కోపంగా బయటకు వచ్చాడు కనిపించలేదు అలివేలు

గుడిశె వెనుక వైపు మోకాలు ఎత్తుగల గోడదూకి అప్పటికేం చాలా దూరం వెళ్ళిపోయింది క్రొత్తదనాన్ని కోరే అలివేలు

కారు రోడ్డుమీది పావలా బిళ్ళలా వెలిగిపోతున్నాడు ఆకాశంలో చంద్రుడు

వెన్నెల్లో చల్లదనం క్రమంగా పెరుగుతోంది.

లాస్టు బస్సు సీతారాములు టీ కొట్టు ముందాగింది బస్సులో నించి ఒక ఆడమనిషి, మరో మగమనిషి కిందికి దిగారు ఆకాశంలో విహరిస్తున్న గంధర్వులు భూలోకంలో దిగినట్లు పోజు పెట్టి.

సీతారాములు కొట్టుముందు నిల్చుని పొయ్యిలోని పచ్చికట్టెలు మండకపోతే నోటితో ఊదుతున్నాడు

పొగ కంట్లోకిపోయి కళ్ళవెంట నీళ్ళొస్తున్నాయి

"రొండు స్టాంగు టీ" అన్నాడు బస్సులో నించి దిగిన తను

"మాఁవా డబుల్" స్టాంగు" అన్నది మర్రిచెట్టు నీడలో నిల్చున్న ఆడమనిషి సన్నగా నవ్వుతూ

ఆ గొంతు విని తలెత్తి చూశాడు సీతారాములు. మొదట్లో గుర్తు పట్టలేదుగాని తర్వాత గుర్తుపట్టాడు అలివేలుని

అలివేలు కూడా సీతారాముల్ని ఎప్పుడో గుర్తుపట్టింది కాని పలకరించలేదు.

టీ తాగిన తర్వాత వాళ్ళిద్దరూ ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని నవ్వుకుంటూ వెళ్ళిపోయారు ఆదర్శ ప్రేమికుల్లా

నవ్వుకుంటూ వెళుతున్న అలివేలుని చూసి "దీనిబతుకింతే ... దీనిబుద్ధి సచ్చిందాకా మారదు" అనుకున్నాడు సీతారాములు

సందు చివరివరకూ వెళ్ళి వెనక్కి తిరిగి సీతారాములువైపు చూసి కిసుక్కునవ్వింది సీతారాముల పాత పెళ్ళాం అలివేలు.

సీతారాములకు నవ్వాలో, ఏడవాలో అర్థంకాక అప్పటికప్పుడే ఒక స్ట్రాంగ్ టీ తాగేశాడు, నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకుపూనుకున్న ట్రాజెడీహీరోలా.

★